
ఇంకుడు గుంతలతో నీటి ఎద్దడికి చెక్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 6: ఇంకుడు గుంతల ఏర్పాటుతో నీటి ఎద్దడికి చెక్ పెట్టొచ్చని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్ తెలిపారు. మంగళవారం కామారెడ్డిలోని ఆర్డీవో, జడ్పీ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నీటి చుక్కను ఒడిసి పట్టేందుకు ప్రణాళికలు చేసినప్పుడే భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా చూసిన వాళ్లం అవుతామని అన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు హార్వేస్టింగ్ పిట్స్‌ను ప్రతీ ఇంట్లో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

పల్లెల్లో పంచాయతీ పోరు

సందడి





- ప్రజలకు చేరువయ్యేందుకు ఆశావహుల ప్రయత్నాలు
- కొన్నిచోట్ల తాజా మాజీ సర్పంచ్‌లు
- మరికొన్ని చోట్ల అధికార పార్టీ శ్రేణులు
- ప్రభుత్వ కార్యాక్రమాల్లో పాల్గొంటున్న ఆశావహులు
- ప్రజల మద్దతు కూడబెట్టుకునే ప్రయత్నం
- రిజర్వేషన్లపైనే ఉత్కంఠ

కామారెడ్డి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో పల్లెలో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంటుంది. ఇప్పటి నుంచే ఆశావహులు ప్రజల్లో ఉంటూ వారి మద్దతు కోసం ప్రయత్నాలు మొదలు పెడుతున్నారు. కొన్నిచోట్ల తాజా మాజీ సర్పంచ్‌లు మరోసారి బరిలో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల అధికార పార్టీ శ్రేణులు ప్రభుత్వ కార్యాక్రమాల్లో పాల్గొంటూ హల్‌చల్ చేస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. ఈసారి తామే బరిలో ఉంటామంటూ ప్రజల మద్దతు కూడ బెట్టుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇలా పల్లెల్లో ఎక్కడ నలుగురు కలిసినా పంచాయతీ ఎన్నికలపైనే చర్చ జరుగుతోంది. ఈసారి గ్రామంలో సర్పంచ్‌గా ఎవరెవరు బరిలో ఉంటారు. రిజర్వేషన్‌లు ఎలా ఉంటాయి అనే దానిపైనే చర్చ కొనసాగుతోంది. అయితే ప్రభుత్వం మరో మూడు నెలల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది.

పల్లెలో కొనసాగుతున్న ప్రత్యేక పాలన

పంచాయతీల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. జిల్లాలో 25 మండలాల్లో 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,642 వార్డులు ఉన్నాయి. 2019 ఓటరు జాబితా ప్రకారం గ్రామ పంచాయతీల్లో 5,18,201 ఓట్లు ఉన్నాయి. ఇందులో పురుషులవి 2,50,447, మహిళలవి 2,82,613, ఇతరులవి 4 ఓట్లు ఉన్నాయి. 526 గ్రామ పంచాయతీలే కాకుండా మరో 9 గ్రామ పంచాయతీల ఏర్పాటుకు గతంలోనే ప్రభుత్వానికి జిల్లా అధికారులు నివేదించారు. వాటి ఆమోదానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే ఈ ఏడాది జనవరి 31తో సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో 6 నెలలు ప్రత్యేకపాలన విధించారు. ఇప్పటికే ప్రత్యేక పాలన గడువు సైతం ముగియడంతో మరోసారి ప్రభుత్వం పెంచింది. ప్రత్యేకాధికారులుగా మండల స్థాయి అధికారులే ఉండడంతో వారి కార్యాలయంలోని పనుల్లోనే బీజీగా ఉండడంతో పంచాయతీ పాలన అదనపు భారం అవుతుందని పలువురు అధికారులు వాపోతున్నారు. కొందరికి రెండేసి గ్రామాలు ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయలేక పోతున్నారు. పంచాయతీ కార్యదర్శులపైనే భారం పడుతోంది. ఏ పని ఉన్నా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. నిధులు కూడా లేకపోవడంతో చిన్నచిన్న పనులు కూడా చేయించలేకపోతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. కొందరు ఆశావహులు చిన్నచిన్న పనులకు సొంతగానే ఖర్చులు చేస్తున్నారు. లైట్లు వేయడం, రోడ్లపై మొరం వేయించి మరమ్మతులు చేయడం వంటి పనులు చేస్తున్నారు.

ప్రజల్లోకి ఆశావహులు

త్వరలోనే పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో సర్పంచ్‌గా పోటీ చేయాలనుకునే ఆశావహులు ప్రజల మద్దతు కూడబెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం ఆశావహులు ప్రజల్లోనే ఉంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో హల్‌చల్ చేస్తూ ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా తాము పోటీలో ఉంటామని సంకేతాలు ఇస్తున్నారు. కొన్నిచోట్ల ప్రజల్లో పేరున్న తాజా మాజీలు మళ్లీ ప్రజల మధ్యే ఉంటుండగా మరికొన్నిచోట్ల అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రభుత్వం తమదేనని తాము ఉంటే నే పనులు అవుతాయని ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో నలుగురు, ఐదుగురు ఆశావ హులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి చెందిన సర్పంచ్‌లే 90 శాతం నెగ్గారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఈసారి తమను ఆదరిస్తారని కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఆశావహుల సందడి నెలకొంటుంది

అధికార పార్టీ శ్రేణుల సందడి

పల్లెల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, పండుగల సందర్భంగా అధికార పార్టీ శ్రేణుల సందడి కనిపిస్తోంది. ఇటీవల జరిగిన రెండు విడతల రుణమాఫీ కార్యక్రమంతో ఆయా గ్రామాల్లో రుణమాఫీ అయిన రైతులను కలిసి వారితో సంబరాలు చేయడం, బోనాల ఉత్సవాల్లో కావాల్సిన సౌకర్యాలు చూసుకోవడం, తాజాగా ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లోనూ ఆశావహుల సందడే కనిపిస్తోంది. పంచాయతీలకు రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ అంటే గత ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం చట్టం చేసింది. ప్రస్తుతం అవే రిజర్వేషన్‌లు ఉంటాయని ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారే తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రభుత్వం మారడంతో ఒకవేళ చట్టంలో మార్పులు చేసి కొత్త రిజర్వేషన్‌లు అమలు చేస్తే వారి ఆశలపై నీళ్లు చల్లినట్లవుతోంది. అప్పుడు కొత్త నాయకులు తెరపైకి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రిజర్వేషన్లపై ఆశావహులు తర్జనభర్జన పడుతున్నారు.

చెరువుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మొక్కను నాటి నీరు పోస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 6: కామారెడ్డి చెరువుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, పొదలను తొలగించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జడ్పీ కార్యాలయం పరిసరాలను, ఎంబీఆర్ ఫిల్టర్‌బెడ్‌ను, పెద్ద చెరువును పరిశీలించి చెరువు వద్ద ఈత మొక్కలను నాటారు. చెరువుకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంచెలు, పిచ్చి మొక్కలు తొలగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ ఉరుదొండ వనిత, డీఎఫ్‌వో నిఖిత, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులను శుభ్రంగా ఉంచాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డి: వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో ఉన్న వాటర్ ట్యాంకును పరిశీలించారు. తాగునీటి వాటర్ ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు సరఫరా సరిగా లేని ప్రాంతాలను గుర్తించి అక్కడికి శుద్ధమైన తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీటి వనరులు శుభ్రం చేయాలని క్లోరినేషన్ కిట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పెద్ద చెరువును పరిశీలించారు. తాగునీటి చెరువుల కుంటలు కలుషితం కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సింగీతం నీటి విడుదల



సింగీతం రిజర్వాయర్ గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

నిజాంసాగర్, ఆగస్టు 6: నిజాంసాగర్ ప్రాజెక్టుకు కల్పతరువు అయిన సింగీతం రిజర్వాయర్ నిండి పొంగి పొర్లుతోంది. గత మూడు రోజులుగా సింగీతం రిజర్వాయర్ ఒక గేటును ఎత్తి 324 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాల్వలోకి మళ్లించారు. రిజర్వాయర్ నిజాంసాగర్ ప్రాజెక్టుకు కల్ప తరవుగా మారింది. 1996 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సింగీతం రిజర్వాయర్ వరద మళ్లింపు పథకం చేపట్టారు. వరద కాల్వలోకి ప్రతీయేటా 1.5 టీఎంసీల నీరు నిజాంసాగర్ కాల్వలోకి విడుదల చేస్తారు. దీని ద్వారా చెరువులు, కుంటలను రైతులు నింపుకుంటారు. 324 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో 416.550 మీటర్ల నీటిని పూర్తిస్థాయిలో నిల్వ ఉంచుతూ నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాల్వలో విడుదల చేస్తున్నారు. 600 ఎకరాల ఆయకట్టు కింద ఉన్న మహ్మద్‌నగర్, బూర్గుల్, తుంకిపల్లి గ్రామాలకు సాగునీరు అందిస్తోంది. సింగీతం రిజర్వాయర్ వరద కాల్వకు వరద గేట్ల సమీపంలో కాల్వ కోతకు గురైంది. నీటి పారుదల శాఖాధికారులు వరద కాల్వ కయ్యలను చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

నిండని నిజాంసాగర్ ప్రాజెక్టు

ఉమ్మడి జిల్లాల వర ప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎలాంటి వరదనీరు రాకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై 2 నెలలు గడుస్తున్నా ప్రాజెక్టు ఎగువ భాగంగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో ప్రాజెక్టు కేవలం 3 టీఎంసీలకే పరిమితమైంది. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సింగూరు నిండితేనే ఏదైనా ప్రాజెక్టులో వరద వచ్చే అవకాశాలున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగులకు గాను 1389.55 అడుగులు, 17.802 టీఎంసీలకు గాను 3.866 టీఎంసీలు నిల్వ ఉంది. మంగళవారం నాటికి నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి ఎలాంటి వరద నీరు రావడం లేదు.



వరద కాల్వకు గండి పడ్డ దృశ్యం

లెక్చరర్ల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



నాగిరెడ్డిపేటలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 6 : మండల కేంద్రంలో కొత్తగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఆరు రోజులుగా లెక్చరర్లు రాక, పాఠాలు బోధించే వారు లేకపోవడంతో కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్‌లను నియమించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. మండల కేంద్రంలో హైదరాబాద్ - బోధన్ ప్రధాన రహదారిపై విద్యార్థులు బైఠాయించి రాస్తారోకో చేశారు. మండల కేంద్రానికి ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేసిందని ఎంతో ఆనందంగా తాము కళాశాలలో అడ్మిషన్లు తీసుకుంటే, కళాశాలలో పాఠాలు బోధించే లెక్చరర్లు లేరని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఒక గదిలో కళాశాలను ప్రారంభించారని అందులో ఎలాంటి సౌకర్యాలు లేవని విద్యార్థులు ఆరోపించారు. ఈ కళాశాలలో పాఠాలు బోధించేందుకు ఎల్లారెడ్డి, పిట్లం కళాశాలల నుంచి తాత్కాలికంగా ఇద్దరు, ముగ్గురు లెక్చరర్లను కేటాయించారని వారు కళాశాలకు ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళ్తారో? తెలియని పరిస్థితి దాపురించిందని విద్యార్థులు వాపోయారు. గత ఆరు రోజులుగా లెక్చరర్లు కళాశాలకు రావడం లేదని వారు తెలిపారు. కో ఎడ్యుకేషన్ ఉన్న ఈ కళాశాలలో ప్రస్తుతం సుమారు 70 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకున్నారని, పాఠాలు బోధించే వారు లేకపోవడంతో ఈ విద్యా సంవత్సరం ఎలా గడుస్తుందోనని విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఏఎస్సై లచ్చిరాం నాయక్ విద్యార్థుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. విద్యార్థుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని నచ్చజెప్పడంతో విద్యార్థులు తమ ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏబీవీపీ నాయకులు జాషువ, వంశీ, షేక్ సమీర్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి అన్నపూర్ణ

ఎల్లారెడ్డి, ఆగస్టు 6 : మొక్కలను నాటి సంరక్షించాలని ఉమ్మడి జిల్లా స్వచ్ఛదనం -పచ్చదనం ప్రత్యేక అధికారిని అన్నపూర్ణ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీలోని 8వ వార్డులో ఉన్న పట్టణ ప్రకృతి వనాన్ని ఆమె పరిశీలించారు. పార్కు ఆవరణలో ఉన్న మొక్కలను పరిశీలించారు. మొక్కలు నాటడంతో పాటు నాటిన మొక్కలను సంరక్షించడంలో కూడా అంతే బాధ్యతగా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని అన్నారు. అందుకు నిదర్శనం ఈ పార్కును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఇదే విధంగా అన్ని ప్రకృతి వనాల్లో మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆమె అన్నారు. అనంతరం మున్సిపల్ ఆవరణలో వివిధ వార్డులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, నీటి పారుదల డీఈ వెంకటేశ్వర్లు, 8వ వార్డు కౌన్సిలర్ భూదేవి, ఏఈ వినోద్, నాయకులు శ్రీనివాస్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణ ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి అన్నపూర్ణ

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

డిచ్‌పల్లి,ఆగస్టు 6: తెలంగాణ యూనివర్సిటీ బిజినెస్‌మెనేజ్‌మెంట్ విభాగంలో మంగళవారం ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా మూవీ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.అంజనేయులు మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులు నైపుణ్యాలు మరింత పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డా.కైసర్,అపర్ణ,వాణి, ఈవెంట్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

ఆటోను తప్పిచబోయి బోల్తా పడిన లారీ

● త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

కమ్మర్‌పల్లి, ఆగస్టు 6: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో మంగళవారం ఉదయం ట్రాలీ ఆటోను తప్పించే ప్రయత్నంలో మిర్చిలోడ్‌తో వెళ్తున్న ఐచర్‌వాహనం బోల్తాపడింది. అదుపుతప్పిన ఐచర్ ఒక దుకాణం షెడ్డును ఢీకొట్టి బోల్తాపడింది. అయితే ఆసమయంలో దుకాణాలు తెరవకపోవడం, అక్కడ జనం ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. మహారాష్ట్ర నుంచి కరీంనగర్‌వైప మిర్చీలోడ్‌తో వెళ్తున్న ఐచర్ వాహనం ఉప్లూర్ టర్నింగ్, భరతమాత విగ్రహంవద్ద యూటర్న్ తీసుకుంటున్న తాగునీటి సరఫరా ఆటోట్రాలీని తప్పించబోయి బోల్తాపడింది. ఐచర్ డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఐచర్ డ్రైవర్‌ను చికిత్సనిమిత్తం 108అంబులెన్స్‌లో మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే టిఫిన్‌సెంటర్లు, టీస్టాళ్లవద్ద రోడ్లపైనే వాహనాలు నిలిపి ఉం చడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని స్థానిక పోలీసులు నియంత్రించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదానికి గురైన రెండు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: పట్టణంలోని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం కేరళ రాష్ట్రంలో వాయినాడ్ జిల్లాలో వరద బాధితుల కోసం విరాళాల సేకరణ చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదలు రావడంతో తీవ్రంగా నష్టం వాటిల్లిందనివారు తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, రవి, ఓంకార్ పోశెట్టి, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్‌ఎంకు వినతి

రెంజల్,ఆగస్టు6: మండలంలోని బాగేపల్లి గ్రామానికి ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ రిజినల్ మేనేజర్‌కు తాజా, మాజీ సర్పంచ్ సాయిలు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలోని విద్యార్థులకు, మహిళలకు రవాణా రాకపోకలు ఇబ్బందిగా ఉండడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక నడుచుకుంటూ వెళ్లడంతో ఇబ్బంది పడుతున్నారని విద్యార్థుల సౌకర్యార్థం బస్సును నడిపించాలని ఆర్‌ఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఆటో సాయిలు, గ్రామస్థులు గోపాల్, సాయగౌడ్, తదితరులున్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఏర్గట్ల, ఆగస్టు 6: బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళ వారం మండలంలోని పలు బాధిత కుటుంబాలను పమరామర్శించారు. అందులో భాగంగా తాళ్లరాంపూర్‌లో రాంపెల్లి లక్ష్మీపతి, ఏర్గట్లలో సొసైటీ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, జక్కుల భూ మన్న, తునికి పెద్ద గంగారాం కుటుంబాలను పరామర్శించి, శంకర్ గౌడ్ కుటుంబానికి 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో భారస మండలాధ్యక్షుడు ఎను గందుల రాజాపూర్ణానందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, నాగులపల్లి అంజిరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ సింగసారం గంగారాం, కొలిప్యాక శ్రీనివాస్, బద్దం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి సన్మానం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై ప్రస్తావించిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని బీజేపీనాయకులు పట్టుశాలువతో ఘనంగా సన్మానించారు. గల్ఫ్ కార్మికుల కష్టాలను, విద్యార్థుల వసతిగృహాల పై, నిరుపేదల పక్క ఇళ్లు, లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా స్వచ్ఛమైన పాలన కొనసాగించాలని అసెంబ్లీలో ప్రస్తావించడాన్ని హర్షిస్తూ ఎమ్మెల్యేను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతి నిధి కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, నాయకులు ఆకుల రాజు, పొల్కం వేణు, జక్కం పోశెట్టి, యుగేందర్, ప్రకాష్, లింగన్న, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు

ఎడపల్లిలో విద్యుత్ నియంత్రిక ధ్వంసం

● నెల వ్యవధిలో పదుల సంఖ్యలో విద్యుత్ నియంత్రికల ధ్వంసం

ఎడపల్లి, ఆగస్టు 6: ఎడపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ రెవెన్యూ శివారులో ఎడపల్లి నుంచి ఎరాజ్‌పల్లి వెళ్లే దారి పక్కన శిరిశెట్టి సంతోష్ పంట పొలంలో ఉన్న ఎస్ఎస్ 167 నంబరు గల విద్యుత్ నియంత్రికను సోమవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి తీగను దొంగిలించారు. మంగళవారం ఉదయం రైతు సంతోష్ తన పొలంకు వెల్లగా విద్యుత్ నియంత్రిక ధ్వంసం అయి ఉండడం చూసి ఆయన పోలీసులకు సమాచారం అందించారు. నెల వ్యవధిలో మండలంలోని ఎడపల్లి , ఇబ్రహీంపూర్, కుర్నాపల్లి, ఠానాకలాన్ శివారులలో దాదాపు 10కి పైగా విద్యుత్ నియంత్రికలను దుండగులు ధ్వంసం చేశారని, రోడ్డు ప్రక్కన ఉన్న నియంత్రికలనే వారు టార్గెట్ చేసి ధ్వంసం చేస్తూ అందులోని రాగి వైరును ఎత్తుకెలుతున్నారని, విద్యుత్ నియంత్రికలు ధ్వంసం కాకుండా పోలీసులు నిఘా పెంచాలని రైతులు కోరుతున్నారు.

120 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మోర్తాడ్, ఆగస్టు6: మండల కేంద్రంలో టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో 120క్వింటాళ్ల 50కిలోల బియ్యాన్ని పట్టుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ ఎదుట ఉన్నరేకుల షెడ్డులో అక్ర మంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని దాడులు చేసి పట్టుకున్నారు. పక్క సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. బియ్యం స్వాధీనం చేసుకొని షెడ్డును సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఓఎస్డీ శ్రీధర్, డిప్యూటీ తహ సీల్దార్ వినోద్, మహేష్, అధికారుల బృందం పాల్గొన్నారు.

జిల్లా అంతటా ఘనంగా జయశంకర్ జయంతి


జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, ఆగస్టు6: తెలంగాణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ లైఫ్‌టైం ఉద్యమకారుడని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో జయశంకర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యమంలో కొంత మంది పార్ట్‌టైం, కొంత మంది ఫుల్‌టైం ఉద్యమం చేశారని, ఆచార్య జయశంకర్ తన లైఫ్‌టైం తెలంగాణ కోసమే పని చేశారని కొనియాడారు. జయశంకర్ చూపిన బాటలోనే కేసీఆర్ రాష్ట్రాన్ని పాలించారని, జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా పదేళ్ల పాటు సీఎంగా తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్‌వన్‌గా నిలిపి సుభిక్షమైన పాలన అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ మండల సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్‌జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి,ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, వైస్‌చైర్మన్ షేక్ మున్నా, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఏబీ.చిన్నా,కాంగ్రెస్‌నాయకులు,బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో

పట్టణంలోని 15వార్డు రాంనగర్‌కాలనీలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గంగామోహన్‌చక్రు, విశ్వబ్రహ్మణ సంఘం సభ్యులు హన్మాండ్లు, నర్సింలు, శేషాద్రి, సుదర్శన్, జిమ్మిరవి, అనిల్, రాజు, శివలింగం, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ సిద్ధంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని లెక్చరర్‌లు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌పెద్దన్న జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన కృషిని వివరించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్‌ప్రిన్సిపాల్ మర్రిపల్లి భూపతి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రాజయ్య, రవీందర్, శ్రీలత, గంగారాం, బాజన్న, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మెండోర: తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర ఎంతో కీలకమైందని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్ అన్నారు. మంగళవారం జయశంకర్ జయంతి సందర్భంగా మండలంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో సెక్రెటరీ రాజ్‌కుమార్, రేషన్‌డీలర్లు అశోక్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్:మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీకార్యాలయంలో ఏర్పాటు చేసిన జయశంకర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేస్తామని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బబ్బురు ప్రతాప్‌రెడ్డి, మాజీఉపసర్పంచ్ పిట్ల సత్యం, మాజీఎంపీటీసీ మొండి మహేష్, నాయకులు మొండి అశోక్, సుంకరి రాము, దయాకర్, కార్తిక్, నరేష్‌రెడ్డి, చిన్నారెడ్డి, దత్తు, అశోక్, మహేష్, సంజయ్, క్రాంతి, గంగాధర్, సంతు, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: తెలంగాణ దార్శనికుడు సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆదర్శప్రాయుడని మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి వెంకటేష్ కొనియాడారు.ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనివాస్, ఏపీఓ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తెలంగాణ ఆత్మగౌరవ చరిత్ర సార్ జీవిత చరిత్ర : టీయూ రిజిస్ట్రార్

డిచ్‌పల్లి: తెలంగాణ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రొ.జయశంకర్ సార్ జయంతి సందర్భంగా రిజిస్ట్రార్ యాదగిరి జయశంకర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు.ఈసందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... నాలుగున్నక కోట్ల ఉద్యమ ఆకాంక్షను ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడు ప్రొ.జయశంకర్ సార్ అని తెలంగాణ ఆత్మగౌరవ పోరాట చరిత్ర, సార్ జీవిత చరిత్ర అని పేర్కొన్నారు. ఉద్యమంతో ముడేసుకున్న జీవితం ఆయనదని విద్యాలయాలు, భవన నిర్మాణాల వల్ల నిలబడవని, బోధన వల్లే నిలబడుతాయని విశ్వసించిన వ్యక్తి జయశంకర్‌ది అన్నారు. మానవతమూర్తి అని ప్రశంసించారు.ప్రిన్సిపాల్ ఆరతి మాట్లాడుతూ...ఒక సాధారణ ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి కాకతీయ వర్సిటీ వీసీగా ఎదగడం ఆదర్శ ప్రాయమన్నారు. ప్రొ.రవీందర్ మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్తగా కొనసాగిన వ్యక్తి తెలంగాణరాష్ట్ర సాధన ఉద్యమానికి దిక్సూచిగా మారడన్నారు. ఈకార్యక్రమంలో టీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు పున్నయ్య, అరుణ, సత్యనారయణ, ఉమారాణి, డా.నాగరాజు, ఖురేషి, రమణచారి, లక్ష్మణచక్రవర్తి, అకాడమిక్ కన్సల్టెంట్ లు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: తెలంగాణ మార్గనిర్దేశకుడు, ప్రొ.జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం నడిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసినివాళ్లు అర్పించారు.

వర్ని: చందూర్ మండల కేంద్రంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ ప్యారం అశోక్, కర్లం సాయిరెడ్డి, తూర్పు కృష్ణారెడ్డి, వడ్ల దత్తు, వెంకట్ రెడ్డి, అరికెల సాయిరెడ్డి, నరెడ్ల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల అభివృద్ధి అధికారి శంకర్ నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో శ్రీవాణీ, జూనియర్ అసిస్టెంట్ అభిషేక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ కోసం చేసిన సేవలను విద్యార్థులకు అధికారులు వివరించారు.

కోటగిరి: పొతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన తెలంగాణ ఉద్యమంలో చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక దర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జన వికాస్ సేవ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి, నరేష్,తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: ప్రత్యేక రాష్ట్రం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం రుద్రూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి నిర్మల ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో, ఏపీవో, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లకోసారి వేతన చట్టాన్ని సవరించాలి

● ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ


నందిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

నందిపేట,ఆగస్టు 6:కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీసవేతన చట్టాన్ని సవరించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం నందిపేట మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీకార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. బీడీ కార్మికులు పొందుతున్న జీవనభృతి, చేయూత పథకం కింద రూ.2016ను రూ.4016కు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని రాజానగర్ దుబ్బా ప్రాంతంలో ఉన్న టెలిఫోన్ బీడీ కంపెనీ నుంచి మండల తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఆనంద్ కుమార్‌కు అందజేశారు. ఈసందర్భంగా అక్కడే సమావేశమైన రాష్ట్ర అధ్యక్షుడు వనమాలకృష్ణ మాట్లాడుతూ బీడీకార్మికులకు 8 నుంచి 12రోజులు మాత్రమే పని దొరకడం వలన కుటుంబ పోషణ భారమైందని తెలిపారు. కార్మికులకు వెయ్యిబీడీలకు రూ.249 రావాల్సి ఉండగా రూ.160 మాత్రమే అందుతుందని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి వేతన చట్టాన్ని సవరించి బీడీ కార్మికులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజే శ్వర్, మండల కార్యదర్శి సాయరెడ్డి, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, మండలంలోని కుర్లా, శివాజీ, టెలిఫోన్, దేశాయి బీడీ కంపెనీల కార్మికులు తదితరులు ఉన్నారు.

నల్లగుట్టతండాలో బావిలో పడి ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, ఆగస్టు6: మండలంలోని నల్లగుటతండా గ్రామానికి చెందిన మూడు దినేష్(25) నీటిబావిలో పడిమృతి చెందినట్లు ఎస్సైతిరుపతి తెలిపారు. ఎస్సైతెలిపిన వివరాల ప్రకారం నల్లగుట్ట గ్రామానికి చెందిన మూడు దినేష్‌చిన్నప్పటి నుంచి అంగవైకల్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దినేష్ ఆచూకీ కోసం గాలిస్తుండగా మంగళవారం మధ్యాహ్నం గ్రామశివారులోని తన కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమి దగ్గరలోని నీటిబావిలో పడిచనిపోగా మృత దేహం కనిపించిందని ఎస్సై తెలిపారు. మృతుడు ఇంటి నుంచి బావి వద్దకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నీటిబావిలో పడి పోవడంతో ఈత రాక చనిపోయాడని మృతుని అన్న ముడుగణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.మృత దేహాన్ని పోస్టు మార్టంనిమిత్తం ఆర్మూర్‌ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

తృటిలో తప్పిన బస్సు ప్రమాదం


ధ్వంసం అయిన బస్సు ఇదే

మోస్రా,ఆగస్టు6: మండల కేంద్ర శివారులో అలీసాగర్ చౌరస్తా వద్ద తృటిలో బస్సు ప్రమాదం తప్పింది. ఉమ్మడి వర్ని మండల ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి మోస్రా వైపు వస్తున్న లారీ వెనకే వస్తున్న ఆర్టీసీ బస్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్ ముందు అద్దం పగలగా ఎవరికి ఏం గాయాలు కాలేదు. అయితే బస్, లారీ యజమానులను, డ్రైవర్లను ఎస్సై పోలీస్ స్టేషన్‌కు పిలిచి డ్రైవర్లను మందలించి వదిలేశారు. మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవింగ్ చేయాలని సూచనలు ఇచ్చి పంపించారు.

తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం

డిచ్‌పల్లి,ఆగస్టు 6: పుట్టిన బిడ్డ నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని ఎలాంటి ఆహారం ఇవ్వకూడదని జిల్లా ఉమెన్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్‌బీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్ఎల్‌జీ మండపంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా 14మండలాలకు చెందిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, ఆశావర్కర్‌లను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. శిశువును తల్లి పాలు మాత్రమే తాగించాలని నీళ్ల, తేనే, గ్లూగోజ్, జంతువుల పాలు ఇవ్వవద్దని విరేచనలు అయ్యే ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ మాట్లాడుతూ.. శిశువుకు తల్లి పాలు ఇవ్వడంతో ఎంతో లాభాలు ఉన్నాయని, తల్లి పట్ల ప్రేమ ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో స్వర్ణలత, లేబర్ ఆఫీసర్ యోహాన్, ఎంపీడీవో రాజేందర్, ఆరోగ్య పర్యవేక్షకురాలు దేవపాలమాత ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ ప్రథమ వర్ధంతి

నందిపేట, ఆగస్టు 6: నందిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు, కవిగద్దర్ (గద్దరన్న) ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిం చారు. ఈ సందర్భంగా వక్తలు మా ట్లాడుతూ ప్రజల కోసం ఉద్యమాలను నడిపి, పోలీసు తూటాలకు కూడా బ య పడని వ్యక్తి గద్దరన్న అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కె గంగాధర్, ఎం దేవన్న, బైన మల్లయ్య, సతీష్, తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం


పచ్చలనడ్కుడలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వేల్పూర్, ఆగస్టు6: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామం ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు జె.రమేష్ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉషారాణి, గణేష్, రవీందర్, ప్రభాకర్, గంగారెడ్డి, ప్రవీన్‌లను సన్మానించారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, మాజీ సర్పంచ్ శ్వేత గంగారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శికి సన్మానం

వేల్పూర్, ఆగస్టు6: వేల్పూర్ మండలంలో జరిగిన పీఆర్‌టీయూ ఎన్నికల్లో మండల ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన మోతె గ్రామ ప్రభుత్వ పాఠశాల ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు సివి.నర్సింహరావును సన్మానించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల తరఫున నర్సింహరావును శాలువ, మెమోంటోతో సన్మానించారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వైద్యగణేష్, పీఆర్‌టీయూ నాయకులు మంచిర్యాల సురేష్, ఉపాధ్యాయులు మహేందర్, రత్నయ్య, కవిత, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద తొలగించాలని వినతి

ఎడపల్లి, ఆగస్టు6: పోచారంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని వాటి నుండి గ్రామస్థులు గాయాలు కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల పశువైద్యాధికారి ప్రమోద్ కుమార్‌కు మంగళవారం పోచారం గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. గ్రామం చుట్టూ గుట్టలు ఉండడంతో వేరే గ్రామాలనుండి పట్టుకు వచ్చిన కుక్కలను గుట్టలలో విడిచి పెట్టడంతో గ్రామంలో గతవారం రోజుల నుంచి వీధి కుక్కలు అధికమయ్యాయని, అవి దాడి చేయడం వల్ల గ్రామంలో చాలా మందికి గాయాలు అయ్యాయని వీధి కుక్కల బారి నుంచి గ్రామస్థులను కాపాడాలని మండల పశు వైద్యాధికారిని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వీరిలో గ్రామస్థులు అశోక్, ఇస్తారి, రవి కుమార్, ముత్తన్న, కట్ట సుధాకర్, కట్ట సాయిలు, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం


వర్నిలో స్వచ్ఛదనం, పచ్చదనంను తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్

వర్ని,ఆగస్టు6: వర్ని మండలంలో మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ ఏరియా, కోటయ్య క్యాంపులో పల్లె ప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించారు. చెత్తాచెదారం లేకుండా చూడాలని, నీటి నిల్వలు తొలగించాలని అధికారులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో మారుతి, తహసీల్దార్ సాయిలు, ప్రత్యేక అధికారి రవీందర్, గ్రామ కార్యదర్శి సాయిలు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో మంగళవారం స్వచ్ఛదనం, పచ్చదనం చురుకుగా కొనసాగింది. మండలంలోని కొత్తపల్లి, హెగ్డోలి, పొతంగల్, కోటగిరి గ్రామాలలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. నీటిట్యాంకులను క్లోరినేషన్ చేయించారు. కొత్త పల్లి గ్రామంలో పల్లె దవాఖానాను పరిశీలించారు. ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కల్పించారు. చెరువు కట్టల బలోపేతం కొరకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మనోహర్ రెడ్డి, తహసీల్దార్ గంగాధర్, ఎంపీవో, ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు జరుపుతున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతీఒక్కరు తమ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయగౌడ్ అన్నారు. మంగళవారం మండంలోని ఉప్లూర్ గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అందరితో కలిసి శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో పారిశుద్యం, తాగునీటి వనరులవద్ద పరిశుభ్రతతో పాటు తాగునీటిలో కలిపిన క్లోరినేషన్ శాతాన్ని పరిశీలించారు, పిచ్చిమొక్కల తొలగింపు కార్యమాలను ఆయన పరిశీలించారు.స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మొక్కలు నాటారు. అక్కడ పారిశుద్యాన్ని పరిశీలించారు.బతుకమ్మ కుంట వద్ద స్థలాన్ని పరిశీలించి మొక్కలునాలని ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ అంజనేయులు,ఏపీఎం కుంటగంగారెడ్డి, ఎంపీవో సదాశివ్, ఏపీవో విద్యానంద్ కార్యదర్శులు నరేందర్, శాంతికుమార్, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు. అశావర్కర్‌లు,గ్రామస్థాయి అధికారులు ఈజీఎస్,ఐకేపి సిబ్బంది, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలంలో జరుగుతున్న స్వచ్ఛదనం పచ్చదనం పనులను మంగళవారం జిల్లాడీఆర్‌డీవో సాయిగౌడ్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా గుమ్మిర్యాల్ గ్రామంలో మొక్కను నాటారు. పలు పాఠశాలలు సం దర్శించి వాటర్ ట్యాంక్‌లు, ఏర్గట్లలో నర్సరీ, మండల సమాఖ్యకు సంబం ధించి కుట్టుమిషన్, విద్యార్థుల ఏకరూప దుస్తువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శివరామకృష్ణ, తహసీల్దార్ శ్రీలత, ఎంపిడీవో వెంకటేశ్వర్లు, ఏపీఎమ్ శ్యామ్, ఎంపీవో శివచరణ్, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, కారోబార్, ఆశావర్కర్‌లు, అంగ్‌వాడీలు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బోధన్ మండలంలోని మినార్‌పల్లి, భవానీపేట్ గ్రామాలను మంగళవారం డీపీవో, బోదన్ మండల ప్రత్యేక అధికారి తరుణ్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిసరాల ప్రాంతాలను, గ్రామాల్లోని వార్డులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో మధుకర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం- పచ్ఛదానం కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం గ్రామాలలో మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొని వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆయా గ్రామాలలో అధికారులు మొక్కలు నాటుతున్నారు. రోడ్ల వెంట ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి శ్రమదానం చేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంటింటికి వెళ్ళి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో ఈనెల 9వ తేదీ వరకు స్వచ్ఛదనం - పచ్ఛదనంలో భాగంగా రోజువారి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, ఎంపీడీవో సతీష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్మాయి, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, గ్రామప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముప్కాల్:నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని బాల్కొండ తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. మంగళవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో స్వచ్ఛదనం - పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా పల్లె ప్రకృతి వనాన్ని ఆయన సందర్శించారు. ప్రకృతి వనంలో ఉన్న చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలని అధికారులకు ఆదేశించారు. పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించి పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. అలాగే బాల్కొండ మండలంలోని ఇత్వార్‌పేట్, జలాల్‌పూర్, నాగాపూర్, బస్సాపూర్ గ్రామాలలో ఎంపీడీవోవిజయభాస్కర్‌రెడ్డి పర్యటించి పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛదానం - పచ్ఛదానం కార్యక్రమం నిర్వహించారు. అలా గే ముప్కాల్ మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛదానం- పచ్ఛ దానం కార్యక్రమం భాగంగా తాగునీరు, వర్షం నీటి సంరక్షణ పై చేపట్టే కార్యక్రమాలపై స్పెషల్ ఆఫీసర్,ఎంపీడీవో అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వర్ని: స్వచ్ఛదనం, పచ్ఛదనం రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పారిశుద్యం పనులు బాగున్నాయని గ్రామ పంచాయతీ పారిశుద్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మధురిమ, సీనియర్ సహాయకులు రాజబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి వనజ లత, పంచాయతీ సిబ్బంది, ఐకేపీ సీఏ, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముప్కాల్, ఆగస్టు6: పోస్టాఫీస్‌లో పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎఎస్పీ శ్రావన్‌కుమార్ అన్నారు. మంగళవారం ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో తపాలశాఖ ఆధ్వర్యంలో గ్రామస్థులకు పథకాలపై అవగాహన కల్పించారు. పోస్టాఫీస్‌ను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పోస్టాఫీస్‌లోని పథకాలను ప్రజలకు వివరించారు. 10ఏళ్ల దాటిన ప్రతీఒక్కరు రూ.500లతో ఖాతాలను ప్రారంభించవచ్చని, ఖాతా ద్వారా వచ్చే చెక్కును, ఏటీఎంను, నిఫ్ట్ సౌకర్యాలు ఉచితంగా పొందవచ్చని వివరించారు. రికరింగ్ డిపాజిట్, చిన్నపొదుపు పెద్ద రాబడి అందిస్తుందని, ప్రతీనెల ఆర్‌డీ సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా, అకౌంట్ బుక్ ద్వారా జీవిత బీమా పొందవచ్చని, వివిధ బీమా పథకాలు తపాల ద్వారా అందజేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శైవశ్రీనివాస్, కార్యదర్శి రాజ్యలక్ష్మీ, దశరథ్, బీపీఎం తదితరులు పాల్గొన్నారు.

రూ.3లక్షల వ్యయంతో రోడ్డు మరమ్మతులు



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైన దృశ్యం

వర్ని,ఆగస్టు6: ఈ నెల 4న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన ప్రమాదాలకు అడ్డాగా వర్ని-కోటగిరి రహదారి కథనంపై కాంగ్రెస్ నాయకులు మంగళవారం స్పందించారు. డీసీసీ డెలిగేట్ వై.శ్రీనివాస్ రావు స్వయంగా స్పందించి రోడ్డు మరమ్మతుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. వర్ని మండల కేంద్రం నుంచి తగిలేపల్లి, అంబం(ఆర్)గ్రామం మీదుగా కోటగిరి మండల కేంద్రంకు వెళ్లే రహదారిపై గల బురద గుంతలను చదును చేయించి సుమారు రూ.3లక్షల వ్యయంతో కంకర చిప్స్ వేయించి ప్రజల రాకపోకలకు అటంకం కలుగకుండా చర్యలు చేపట్టారు. అధ్వాన్నంగా మారిన రోడ్డుతో తరుచూ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది కాళ్లు, చేతులు విరిగి ఆసుపత్రుల పాలయ్యారని ప్రయాణికులు గుర్తు చేశారు. 'ఆంధ్రజ్యోతి' కథనంతో యలమంచిలి శ్రీనివాస్ రావు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టి మానవతా దృక్పదంను చాటుకున్నారని ఆయా మండల కేంద్రాలు, గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఏసీపీ బస్వారెడ్డికి ఘన సన్మానం


ఏసీపీ బస్వారెడ్డిని సన్మానిస్తున్న జీజీ ఫౌండేషన్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏసీపీ బస్వారెడ్డిని పట్టు శాలువతో ఘనంగా సన్మానించారు. ఇటీవల అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా బస్వారెడ్డిని శాలువతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో జీజీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నివేదన్ గుజరాతీ, డిజె. దయానంద్, ప్రవీణ్‌పవార్, జెస్సు ఆనంద్, వేణు, బెల్దారి శ్రీనివాస్, రాజేశ్వర్, డిజె.సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సంఘం నుంచి ఐదుగురి శాశ్వత సభ్యత్వం రద్దు

డిచ్‌పల్లి,ఆగస్టు 6: మండలంలోని బర్ధిపూర్ శివారులో గల కమ్మ సంఘంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మెజార్టీ సభ్యులు తీసుకున్న నిర్ణయాలను తీర్మానం చేయడం జరిగిందని జిల్లా అధ్యక్షురాలు అప్పనేని లక్ష్మీ ఓ ప్రకటనలో తెలిపారు. గత పాలక వర్గం, ప్రస్తుత పాలకవర్గంలో ఉండి ఆర్థికంగా సంఘానికి అన్యాయం చేసిన ఐదుగురు సభ్యులను శాశ్వతంగా తొలగించామని తీర్మానం చేశామన్నారు. ఇందులో పూర్వకమిటీ అధ్యక్షుడు కలగర శ్రీనివాసరావు, పూర్వ కమిటీ కార్యదర్శి మండవ రామకృష్ణ, కోశాధికారి కావూరి కృష్ణరావు, ప్రస్తుత కమిటీ ఉపాధ్యక్షులు కలగర వెంకటేశ్వర రావు, ప్రస్తుత కమిటీ సంయుక్త కార్యదర్శి వెనిగల సురేశ్‌లు ఉన్నారని తెలిపారు. వీరి ప్రాథమిక సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే కోశాధికారి ముప్పనేని అప్పరావు సమర్పించిన 3ఏళ్ల ఆర్థిక లావాదేవీలను ఏకగ్రీవంగా ఆమోదించామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన

కోటగిరి,ఆగస్టు6: కోటగిరి, పొతంగల్ మండలాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత, మణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యం పెంపొందించాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


నవీపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,ఆగస్టు6: విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యం పెంపొందించాల్సిన అవసరం ఎంతైన ఉందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో గత 11సంవత్సరాల క్రితం తమ ప్రభుత్వ హయంలో నవీపేటలో పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించామని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యను అభ్యసిస్తే రాబోయే రోజులలో వారికి మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. తమ ప్రభుత్వం సాంకేతిక విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. కళాశాలలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తామని అన్నారు. విద్యార్థులు బాగా చదివి మంచి ప్రయోజకులు కావాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థులతో స్వయంగా మాట్లాడారు. ప్రస్తుతం నవీపేట కళాశాలలో 50శాతం మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయని, మిగిలిన సీట్లను సైతం భర్తీ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

● కాలువపై వంతెన నిర్మించాలని వినతి

మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల సమీపంలో అలీసాగర్ కాలువపై వంతెన నిర్మించాలని పలువురు స్థానికులు, మోడల్ పాఠశాల విద్యార్థులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కోరారు. నవీపేట పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే తిరిగి నిజామాబాద్ వెళ్తుండగా పలువురు స్థానికులు ఎమ్మెల్యేను కలిశారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్‌లు కేటాయించిన అధికారులపై చర్యలు తీసు కోవాలని వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలాలను అప్పటి అధికార పార్టీ నాయకులు యాదేచ్ఛగా కబ్జాలు చేసి వాటిని నకిలీ పత్రాలు సృష్టించి ఇంటి నెంబర్‌లు కేటాయించారని, మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇంటి నెంబర్‌లు కేటాయించిన అధికారులపై తక్షణమే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు, నాయకులు నర్సయ్య, నవాబ్, శ్రీకాంత్, నరేష్, శీను, మంగ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయశంకర్ జయంతి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 6: ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, టీఎన్‌జీవోస్ నేతలతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇందుప్రియ ఆధ్వర్యంలో బాలుర పాఠశాల వద్ద గల జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం తొలితరం నుంచి అహర్నిశలు పోరాడిన వ్యక్తి అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ ఏర్పడిందని ఉద్యమ సమయంలో ఏ రకంగా స్పూర్తిదాయకంగా నిలిచాడనే దానిపై గుర్తు చేసుకుంటు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయిలు, ఆర్‌డీవో రంగనాథ్, మున్సిపల్ కమిషనర్ సుజాత, మున్సిపల్ కౌన్సిలర్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ: ప్రొఫెసర్ జయశంకర్ సార్ బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం బాన్సువాడ పట్టణంలోని కాంస్య విగ్రహంకు ఎమ్మెల్యే పోచారంతో పాటు ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్, మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంత కర్త, తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ జయశంకర్ సార్ చూపిన బాటలో ప్రతి ఒక్క యువత, నాయకులు నడుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో పోరాడిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని ఆయన కొనియాడారు.

బీర్కూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జయశంకర్ తెలంగాణ సమాజానికి ఎంతగానో సేవలందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఎంపీవో మహబూబ్, సూపరింటెండెంట్ భానుప్రకాష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో జయశంకర్ చిత్ర పటానికి సంతోష్‌కుమార్ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయన్ని ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలను తెలంగాణ ప్రజలకు సవివరంగా వివరించిన మహనుభావుడని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో, సౌత్ క్యాంపస్‌లో జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలల్లో ఆయా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల పరిషత్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జయశంకర్ జయంతిని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ జయశంకర్ చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామాల్లో జయశంకర్ జయంతిని జరుపుకున్నారు. మండలంలోని నాగల్‌గాం గ్రామంలో ఎంపీడీవో శ్రీనివాస్ జయశకంర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కార్యాలయాల్లో జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండల వడ్రంగి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


జయశంకర్‌కు నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్, టీఎన్‌జీవోస్ ఉద్యోగులు


బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం


బీర్కూర్‌లో..


దోమకొండలో..


మద్నూర్‌లో..


జుక్కల్‌లో గద్దర్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పేదల విముక్తి కోసం పోరాటం చేసిన మహానీయుడు గద్దర్

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 6: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేద ప్రజల విముక్తి కోసం పోరాటం చేసిన మహానీయుడు గద్దర్ అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్‌గొండ తెలిపారు. మంగళవారం జుక్కల్ మండల కేంద్రంలో గద్దర్ వర్ధంతిని పురస్కరించుకుని గద్దర్‌కు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ గొండ మాట్లాడుతూ ప్రజల సమస్యలు తన సమస్యలుగా భావించి వాటి పోరాటం కోసం గద్దర్ కృషి చేశాడని తెలిపారు. ప్రజానౌక గద్దర్‌కు జుక్కల్ ప్రాంతంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్, మండల అధ్యక్షుడు ఫిర్దోస్, తదితరులు పాల్గొన్నారు.

పూల మొక్కల పెంపకం ద్వారా లాభాలు గడించాలి

• డీఆర్‌డీవో సురేందర్

బీర్కూర్, ఆగస్టు 6: మహిళలు తమ ఇంటి ఆవరణలో పెంచుతున్న పూల మొక్కల ద్వారా డెకొరేషన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఆక్టివిటి ప్లాన్ చేయాలని డీఆర్‌డీవో సురేందర్ మహిళా సభ్యులకు సూచించారు. మంగళవారం ఆయన బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో చేపడుతున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ప్రజలను భాగస్వాములను చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామ సంఘం, ఎస్‌హెచ్‌జీ సభ్యులు గ్రామంలో పండించే పంటల ద్వారా మిల్లెట్స్ ఆక్టివిటీ చేపట్టాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా రుణాలు తీసుకుని గేదెలు పెరటి కోళ్ల పెంపకం, చిన్న వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం ఐబీ సుధాకర్, ఎంపీడీవో భారతి, ఏపీఎం గంగాధర్, ఏపీవో అక్మల్, సీసీలు, టీఏలు, జీపీ సెక్రెటరీ, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

శిశుమందిర్ పాఠశాలలో వైద్యపరీక్షలు

రాజంపేట, ఆగస్టు 6: మండల కేంద్రంలోని శ్రీ శారద శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం రాష్ట్రీయ బాల సంస్థ కార్యక్రమం ద్వారా టీఎంహెచ్‌టీ హెల్త్‌క్యాంపును నిర్వహించినట్లు వైద్యులు హరీష్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడంతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఇంటి పరిసరాలు పరిశుభ్రతపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దివ్యభారతీ, ఫార్మాసిస్ట్ స్వప్న, ప్రధానోపాధ్యాయులు పండరినాథ్, ఉపాధ్యాయులు ప్రభాకర్, సోనుప్రియ, సుస్మిత, నవ్య తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో 'రైతు నేస్తం'

దోమకొండ, ఆగస్టు 6: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మీ, ఏవో పవన్, మాజీ జడ్పీటీసీ తిర్మల్ గౌడ్, రైతులు పాల్గొన్నారు. రైతు వేదికలో రైతులు పంటలపై పలు మందులు పిచికారీ, పంటల సాగు, పురుగు నివారణకు మందులపై అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీలత, క్రిష్టారెడ్డి, సీతారాం మధు, రైతులు పాల్గొన్నారు.

గోకుల్ తండాలో వైద్య శిబిరం

రామారెడ్డి, ఆగస్టు 6: రామారెడ్డి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం గోకుల్‌తండాలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సురేష్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల గురించి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు వివరించినట్లు తెలిపారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నూతన చట్టాలు, షీటీంపై విద్యార్థులకు అవగాహన

భిక్కనూరు, ఆగస్టు 6: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టీసేఫ్, సైబర్‌క్రైం, షీటీం, రోడ్ సేఫ్టీ, నూతన చట్టాలపై, మానవ అక్రమ రవాణాపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయి కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టీసేఫ్‌ను ప్లేస్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకుని ప్రయాణ సమయంలో, ఆపద లో ఉన్నప్పుడు ఉపయోగించుకోవచ్చునని, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా 8712686094కు ఫోన్ చేయాలని, సైబర్ నేరాల పట్ల టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్‌చేసి వినియోగించు కోవాలని, అత్యవసర సమయంలో టోల్‌ఫ్రీ 100, 108, 1930, 181 లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ నరేందర్‌రెడ్డి, కళా బృందం, షీటీం, ఏహెచ్‌టీయూ రాజేందర్, భిక్కనూరు పోలీసు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో 'స్వచ్ఛదనం - పచ్చదనం'

భిక్కనూరు, ఆగస్టు 6: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు, మంచినీటి ట్యాంకుల శుభ్రత, నీటి పరీక్షల కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఏవో రాధ, అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని 46వ వార్డులో మురికి కాలువల శుభ్రత, చెట్లు నాటడం, వీధి దీపాల ఏర్పాటు, పురాతన ఇళ్లను గుర్తించడం లాంటి పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కన్నయ్య, వార్డు స్పెషల్ ఆఫీసర్ రమేష్, గొలివడ్డ రాజు, సంగమేశ్వర, సాయి, శోభక్క, ఈశ్వర్, హుస్సేన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: మండలంలోని సముందర్ తండాలో అధికారులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషన్, ఎంపీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పని చేయాలి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు

మద్నూర్: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మద్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి మద్నూర్ మండల అధికారులతో, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో అందరూ భాగస్వాములై నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో పారిశుధ్యం, మొక్కల పెంపకంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని అన్నారు.


మద్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు


కామారెడ్డిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన సుష్మా స్వరాజ్

బాన్సువాడ, ఆగస్టు 6: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం సుష్మాస్వరాజ్ కీలక పాత్ర పోషించారని బీజేపీ బాన్సువాడ అసెంబ్లీ కన్వీనర్ గొడుగుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయంలో సుష్మాస్వరాజ్ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పయ్యల శంకర్‌గౌడ్, మండల సెక్రెటరీ పాశం భాస్కర్‌రెడ్డి, కోణాల గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సుష్మాస్వరాజ్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ కార్యకర్తలు

ఆరెపల్లికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు

రాజంపేట, ఆగస్టు 6: మండలంలోని ఆరెపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యంను మంగళవారం నుంచి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామానికి 12 సంవత్సరాల తర్వాత ఆర్టీసీ బస్సును పునఃప్రారంభించడం సంతోషకరమని అన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. జిల్లా కేంద్రానికి చదువుకునేందుకు వెళ్లే విద్యార్థులు ఆరు కిలో మీటర్లు నడుచుకుంటూ వెళ్లి వచ్చే పరిస్థితులు ఉండేవని తెలిపారు.



'ఏనుగు' వర్గం కార్యకర్తల ముందస్తు అరెస్టు


రాజీవ్ గాంధీ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఏనుగు వర్గం నాయకులను లాకెలుతున్న పోలీసులు

బాన్సువాడ, ఆగస్టు 6: బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకూ రాజకీయ పరిస్థితి వేడెక్కుతోంది. ఒక పక్క పోచారం వర్గం, మరో పక్క ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం మీద పోరు కొనసాగుతోంది. బాన్సువాడ మండలం కొత్తబాది మోడల్ పాఠశాలలో మంగళవారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో పాల్గొనడానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కార్యక్రమానికి అడ్డు తగులుతారని ముందు జాగ్రత్తగా పోలీసులకు ఇంటలిజెన్స్ వర్గాలు అప్రమత్తం చేయడంతో పోలీసులు మంగళవారం ఉదయం కొత్తబాది గ్రామంలో ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గానికి చెందిన ఐదుగురు యువకులను శాలికాన్, దారావత్ గోపాల్, ధరావత్ ఆనంద్, బాబా, నాని కార్యకర్తలను ఇంటి నుంచి తీసుకువచ్చి ముందస్తుగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌లో పెట్టారు. ఈ అరెస్టులను నిరసిస్తూ ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం పెద్దఎత్తున బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని అరెస్టు చేసిన కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టును నిరసిస్తూ బాన్సువాడ రాజీవ్‌గాంధీ చౌక్ వద్ద నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలను ధరించి ధర్నాకు దిగారు. తక్షణం అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. చివరికి పట్టణ సీఐ కృష్ణ, రూరల్ సీఐ సత్యనారాయణగౌడ్‌లు వర్గం నాయకులు కార్యకర్తలను ధర్నా స్థలం నుంచి లాక్కెళ్లారు. చివరికి నాయకులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో కొత్తకొండ భాస్కర్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మంత్రి గణేష్, బాడి శ్రీనివాస్, యూసుఫ్, లాయక్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నను హత్య చేసిన తమ్ముడు

● లైట్ వేసే క్రమంలో ఘర్షణ, కత్తెరతో దాడి


కృష్ణ (ఫైల్)

బాన్సువాడ, ఆగస్టు 6: పట్టణంలోని దాల్మల్ గుట్టలో సోమవారం అర్ధరాత్రి అన్నదమ్ముళ్ల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. చివరకు తమ్ముని చేతిలో అన్న వకీల్ కృష్ణ(45) హత్యకు గురయ్యాడు. సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. వకీల్ కృష్ణ, వకీల్ రాజు ఇద్దరు అన్నదమ్ముళ్లు. కృష్ణ వంటలు వండుతూ.. రాజు కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. సోమవారం రాత్రి సమయంలో స్నానం చేయడానికి కృష్ణ బాత్‌రూంకు వెళ్లగా చీకటి ఉండటంతో తన తమ్ముడు రాజును లైట్ వేయమని కోరగా భోజనం చేస్తున్నాను తిన్న తరువాత వేస్తానని తమ్ముడు సమాధానం ఇచ్చాడు. ఇంతలో ఇద్దరి మధ్య ఘర్షణ ఏర్పడింది. దీంతో రాజు క్షణికావేశానికిలోనై కుట్టు మిషిన్ కత్తెరతో అన్న కృష్ణ మెడపై దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

పోస్టుమాస్టర్ కిడ్నాప్ కలకలం

బాన్సువాడ, ఆగస్టు 6: బాన్సువాడలో పోస్టుమాస్టర్ కిడ్నాప్ కలకలం రేపింది. బాన్సువాడ మండలం బుడిమి గ్రామంలో విధులు నిర్వహిస్తున్న పోస్టు మాస్టర్ సాయినాథ్ గత కొంత కాలంగా బాన్సువాడ పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్నాడు. మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వచ్చి సాయినాథ్‌ను మెడలో చేతు వేసి బలవంతంగా కార్‌లో ఎత్తుకెళ్లినట్లు భార్య రామలక్ష్మీ పేర్కొన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో భార్య రామలక్ష్మీ ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ జరుపుతున్నారు.

ఫోర్జరీ కేసులో అరెస్టు : సీఐ కృష్ణ

పోస్టుమాస్టర్ సాయినాథ్‌పై హైదరాబాద్‌లోని కార్ఖానా పోలీసు స్టేషన్‌లో ఫోర్జరీ కేసు నమోదు కావడంతో పోలీసులు విచారణ కోసం తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని ఓ భూ కబ్జా కేసులో నిందితుడిగా సాయినాథ్‌తో పాటు బాన్సువాడ మండలానికి చెందిన మరో వ్యక్తి కూడా ఉన్నట్లు తెలిసింది. విచారణ నిమిత్తం పోలీసులు ఇద్దరు వ్యక్తులను తీసుకెళ్లారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

బాన్సువాడ, ఆగస్టు 6: మతిస్థిమితం లేక చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాన్సువాడ మండలం తిరుమలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. తిరుమలాపూర్ గ్రామానికి చెందిన గొల్ల సాయిలు(55) కొంత కాలంగా మతిస్థిమితం లేక పిచ్చి పిచ్చిగా చేసేవాడని, చికిత్స చేయించినా తగ్గలేదన్నారు. కాగా సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో మంగళవారం ఉదయం గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద బట్టలు విడిచి ఉండటంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా సాయిలు మృతదేహం లభ్యమైనట్లు సీఐ తెలిపారు. కుమారుడు గొల్ల గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు

మద్నూర్, ఆగస్టు 6 : మండల కేంద్రంలోని పోచమ్మ గల్లీలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు. వీసీలకు వచ్చిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్న స్థావరంపై ఎస్సై సిబ్బంది దాడి చేసి వారి వద్ద నుంచి రూ.3,300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉమ్మడి మద్నూర్ మండలంలో ఎక్కడైనా పేకాట, మట్కా ఆడుతున్నట్లు సమాచారం ఉన్నట్లయితే పోలీసులకు తెలియజేయాలి. తెలియజేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

ప్లాంటేషన్‌ను పరిశీలించిన ఎఫ్‌డీవో

నాగిరెడ్డిపేట, ఆగస్టు 6: మండలంలోని తాండూర్ గ్రామం వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌ను కామారెడ్డి డివిజనల్ ఫారెస్టు అధికారి రామకృష్ణ పరిశీలించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట స్థానిక ఫారెస్టు రేంజ్ అధికారి వాసుదేవ్ తదితరులు ఉన్నారు.

మానవ మనుగడకు వృక్షాలు అవసరం

• బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, ఆగస్టు 6: మానవ మనుగడకు వృక్షాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ మండలం కొత్తబాది మోడల్ పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ఆగ్రోస్ ఇండస్ట్రీ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఎమ్మెల్యే పోచారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందరంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ మానవునికి ప్రాణవాయువు అందించేది వృక్షాలేనని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరు మొక్కల చొప్పున నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని గ్రామాలను శుభ్రపరచుకున్నారు. విద్యార్థులు తమ లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. అనంతరం ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం గురుకుల పాఠశాలతో పాటు మోడల్ పాఠశాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఆర్డీవో రమేష్ రాథోడ్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఎంపీవో సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఫకీరయ్య, అధ్యాపక బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తబాది మోడల్ పాఠశాలలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పోచారం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- ఓసీ
దర్శన్	- శివంభజే
ప్రియా 70	- కల్కి
ప్రియా 35	- రాయన్, బడ్డి

బాన్సువాడ

మహేశ్వరి	- రాయన్
వెంకటేశ్వర	- పురుషోత్తముడు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

